# అనధీన

## వేలూరి సహజానంద

ఫిడేలు పాట ఉచ్ఛస్థాయిలో వినబడుతోంది. మాటుమణిగిన నిశ్శబ్ద నిశీథంలో సంగీతం మనోహరంగా ఉంది. వెన్నెల్లో, గాలి అలల్లో పాట హాయిగా తేలిపోతోంది. ఇల్లంతా ఒక వాద్యమై, ధ్వనించి, ప్రతిధ్వనిస్తోంది.

పాట తీవ్రతలో మనస్సు లగ్నమై యున్న పార్వతికి తమ్ముడు వేసిన కేక విన్పించలేదు. తన పిలుపు వినని అక్కను విడిచి, ఇంట్లోకిపోయి, "అమ్మా...... బావ....కలరా....వచ్చి" అని ఇంచుమించు అఱచాడు. ఉలిక్కిపడ్డ తల్లి "ఏం నాయనా....ఏమిటి?" అని ఆవేశంలో అడిగింది.

"సాయంకాలానికి ప్రాణం పోయిందిట".

"పార్వతీ" అని అఱచి, ద్వారం వద్ద కూలబడ్డది తల్లి. వణుకుతున్న చేతిలో టెలిగ్రాం పట్టుకొని, తమ్ముడు తల్లి దగ్గర నుంచున్నాడు.

పాట హఠాత్తుగా ఠక్కున ఆగింది. చేతి విసురుకు కమాను ఎడంగా పడ్డది. భగ్నగాయకి యొక్క భయస్పర్శకు ఆఖరి స్వరాలు ఝుకారంలా ప్రతిధ్వనించినయ్.

టెలిగ్రాం పార్వతికి తుపాను మేఘంలా కన్పించింది. ఆ నల్లని అక్షరాల్లోంచి ఎర్రని జ్వాలలు నిలువునా లేచి భగ్గుమన్నయ్. పార్వతి దృష్టిలో తమ్ముడు కన్పించట్లేదు..... తల్లి భగ్నగాత్రం విన్పించట్లేదు. ఏదో మహా ప్రవాహంలో తాను మునిగి, ఉక్కిరిబిక్కిరవుతున్నట్టు.

హృదయం అగ్నిహోమంలా మండిపోతోంది. దుఃఖపు పెనుతుపానుకు శరీరం చుట్టలు చుట్టుకొని పోతోంది.

ఇల్లంతా శోకంతో దగ్ధగృహంలా ఉంది. పొరుగువారు పలువురువచ్చి, మృత్యు క్రౌర్యానికి విస్మితులై, కన్నీరు పెట్టారు. ఏడ్పుతో బొంగురు పోయింది తల్లి గొంతుక. "పాపిష్ఠిదాన్ని...... నాకర్మే.... తల్లికీ" అని మూల్గుతోంది.

పార్వతికి మెల్లగా స్పృహవస్తోంది. అయోమయంగా తెరచుకొన్న కళ్లు ఆకాశంలోని అమావాస్యను చూసి విప్పఱచుకున్నయ్. గోడకు వేలాడుతున్న ఫోటోలో ప్రభు చిరునవ్వు నవ్వుతున్నాడు. చైతన్యం వస్తున్న పార్వతికి కళ్ల నెవ్వరో పొడిచినట్టయింది. నలుమూలల నుంచి అగ్ని నాల్కలు చాపి దహించివేస్తోంది.

తెల్లవారింది. పార్వతి కన్నీటికి కాలం కట్టుపడివుండలేదు. అహోరాత్రాలు ఒక దాన్నొకటి వెన్నంటుతున్నయ్. వాటి దుర్భర భారంతో పార్వతి కృశిస్తోంది. గోడకు వేలాడివున్న నిలువుటద్దంలో తన రూపం ప్రతిబింబిస్తోంది. అలంకారహీనమై ఉంది శరీరం. ఓ మూలన పెట్టెల సందున

పడివుంది ఫిడేలు పెట్టె. ఆ ధ్యాసలేదు పార్వతికి. మృత భర్త తనకూ ప్రపంచానికీ మధ్య అఖాతం కల్పించి పోయాడు.

తల్లి తమ్ముడితో చెప్పుతోంది :

"నాయనా! నువ్వు పుట్టిన రెండేళ్లకే నాన్నగారు కళ్లు మూశారు. ఏదో మీ ఇద్దర్ని పెంచి, పెద్ద చెయ్యటంలోనే నా జీవితం గడిచిపోయింది. కాని అక్క...... దాన్ని నట్టేట్లో దిగబెట్టాడు దేవుడు. దాని ప్రారబ్ధం. ఏం చూసుకొని నలుగుర్లోకి వస్తుంది?"

అవును-తల్లి అన్నది నిజం.....మృత్యువు తనను పూర్తిగా ఏకాకిని చేసి, నిలబెట్టింది? తల్లి కొంతకాలం దాంపత్యం గడపింది. సహజీవితంలోని సౌఖ్యాన్ని అనుభవించింది. ఈ అనుభవానికి ప్రాణానికివున్న శక్తివుంది. వియోగంలో జీవితానికి ఉషస్సును చూపించేది ఈశక్తే. కాని ఈ నిధి తనకు లేదు. తన హృదయం నిరుపేద.

పెళ్లి అయి రెండేళ్లు....పెళ్లి......ఏమిటో.....నలుగురితోపాటు.......

మేళం......మంత్రం.......పాట.....ఆట.....అంతే! మరేమిటి?

తర్వాత కాపురానికి ........ పుట్టినప్పటి నుంచి ఉన్న ఇల్లు విడిచి, కొత్తఇంట్లో అడుగు పెట్టటం...... ఇరవయేళ్ల అజ్ఞాత బంధువు తనకు ప్రాణపతి, అధిపతి, భర్త. మంచివాడు. తన్నేమీ అనడు, కోపగించుకోడు. ఏవో కబుర్లు, కథలు చెప్తాతాడు. నవ్వుతాడు, నవ్విస్తాడు.

కాని ఈ భర్త ఎవరు? ఇతనితో ఈ సంబంధమేమిటి? అతనేదో కచేరీలో పనిపాటలు చేసుకొని ఇంటికి వచ్చేటప్పటికి తాను సింగారించుకొని ఉండేది. 'అహో రాత్రాలీ పరస్పర-స్పర్శలో గడిచిపోయినయ్. కాని ఎవ్వరీ ప్రభు? భర్త ఎవ్వరు? భర్త అంటే?'

ఏమో.... మరి.... నలుగురితోపాటు.....

తన స్నేహితురాండ్రు అందరూ భార్యలు కారూ?

ఇలా దాంపత్యం ఆరంభమైంది. వసంతం మళ్లీ రాకమునుపే వేళ్లు తెగి చెట్టు నేల కూలింది. అనుభవ పారవశ్యంలో ఆకాశమంటుతున్న ఆశాసౌధం సమాధి అయింది.

సంవత్సరకాలం పరస్పరం దాగుడు మూతలాడుకున్నారు. ఇరవయేళ్ల అపరిచయం తొలి స్పర్శలోనే అదృశ్యమై, బాల్యస్నేహితుల నేస్తాని కతీతమైన చనువు ఏర్పడ్డది.

కాని మృత్యువు కళ్లపై గంతలు తీసింది. తానిన్నాళ్ల నుంచి చెట్టపట్టా లాడుతున్న పరిచితుడు ఒక్కసారిగా తన ఆ పరిచయాన్ని వెలిబుచ్చాడు.

పాణి బంధం... అయింది. తెగింది. దాని స్మృతి, శాసన చిహ్నంగా తొడిగిన గాజులు పగిలినయ్. పెట్టిన కుంకుమ చెరిగింది. పేరంటం ప్రవాసమైంది. పాణి బంధమయింది గాని, హృదయమైత్రి కాలేదు. తన అంతరాత్మకు దూరంగానే ఉన్నాడు ప్రభు. బాహ్య కోలాహలంలో, లోని శూన్యపు లోతు అజ్ఞాతంగా ఉండిపోయింది. రెండేళ్ల క్రితం అక్కడే శూన్యం.....ఇప్పుడు గాయం.

సహజీవితపు అమరానుభూతికి తాను నోచుకోలేదు. ఈ నిధి పార్వతికిలేదు. అంతరాత్మకు స్మృతి ఓదార్పు లేదు. స్మృతి యొక్క చల్లని చూపులేదు తనకు. స్మృతి సంజీవి. అది అంతరాత్మకు వెన్నెల వీధిని చూపిస్తుంది. ప్రభు తనతో కాలం గడిపాడు. కాని తనవాడు కాలేదు. అనుభవించిన

పరస్పర ప్రేమ కాష్ఠాగ్ని కతీతమై అంతరాత్మకు కల్పతరువై, హృదయాన్ని జీవంతో స్పందింప జేస్తుంది. ఆ మహానుభూతి తనకు సిద్ధించలేదు.

చిన్న తనంలో నాటిన గులాబీలు పెరిగి, పెద్దయి పూలతో కలకలలాడుతున్నయ్. సంపెంగ వాసన ఇల్లంతా వ్యాపిస్తోంది. కాని తాను......

అవును.... ఎంతమంది ఈ దౌర్భాగ్య దుర్భర భారాన్ని మోస్తున్నారు? వందలు... వేలు... ఇదివరలో.... ఇప్పుడు.... చావులేని యావజ్జీవ ఖైదీలు! జీవించటమే శిక్ష.

ఒకప్పుడు ఉల్లాసము..... ఇప్పుడు దైన్యం..... ఈ వెలుగు చీకట్ల వేట ఏమిటి? మొదట వసంతాహ్వానం...పిదప మరణదండన! ఏమిటీ ఘోరం?

ఏమో.....నలుగురి తోపాటు.... అంతే మరి.

కొత్తగా కాపురానికి వచ్చింది సరస్వతి. తమ్ముని భార్య.... నూతన దంపతుల ఆగమనంతో ఇల్లు మళ్ళీ కలకల లాడుతోంది. తమ్ముడు సంతోషంతో ఉన్మత్తుడౌతున్నాడు. తల్లి కళ్ళల్లో మళ్ళీ వెలుగు వచ్చింది.

కొత్త దంపతుల ఉల్లాసంలో రెండేళ్ళు ఒక్క వెన్నెల రాత్రిలా గడచిపోయినయ్. ప్రేమికుల పదధ్వనిలో సహస్ర గంధర్వకన్యల స్వర్ణమంజీర ఝణంఝణలు ప్రతిధ్వనిస్తున్నట్టు పార్వతి కాలాపన అయింది.

సరస్వతి... తమ్ముని భార్య.....ఇప్పుడు తల్లి.... ఈచిన్న కుటుంబపు ముద్దు ముచ్చటలకు పార్వతి హృదయం మెఱుపులతో మెరిసే మబ్బుల ఆకాశంలా ఉంది.

జీవితం యొక్క సింహద్వారం వద్ద నిలబడిన తమ్ముడు, సరస్వతి మళ్ళీ అనాది నాటకానికే తెఱ లెత్తుతున్నారు. రంగస్థలం మళ్ళీ కోలాహలంగా ఉంది. దీపాలు వరుసన వెలుగుతున్నయ్. పూలతోరణాలు వేలాడుతున్నయ్. రేయి కౌగిట్లో ఇద్దరూ మైమరచి ఉన్నారు.

ఇది యుగయుగాల పారవశ్యం. ఇది నేపథ్య కోలాహలం..... నిజంకాదు. నిజం మరుగుపడి వుంది.

విధి మళ్ళీ ఇద్దరి మధ్య వలపన్నుతోంది. మనోహరమైన సముద్రతీరాన నిలబడి జీవుల నాహ్వానిస్తోంది. అవల తుపాను, సుడిగుండములు.

దుఃఖార్తులు లక్షలాదులు. విషణ్ణ వదనాలతో కాటికి కాలిబాటన సాగిపోతునట్టు పార్వతికి స్ఫురిస్తోంది.

పుత్రోత్సవానికిల్లు కలకలలాడుతోంది. భార్యగా ఉన్న సరస్వతి తల్లై ఇంటి కిలవేల్పు అయింది.

తెల్లవారితే పిల్లడు పుట్టినరోజు పండుగ. తెల్లవారింది. కాని సూర్యోదయం పిల్లవాడెఱుగడు. అకస్మాత్తుగా తీవ్రజ్వరం వచ్చి, పిల్లడు కళ్ళు మూశాడు.

తమ్ముని పుత్రనష్టంతో పార్వతి హృదయం కెలికిన గాయమైంది.

రోజులు గడిచిపోయినయ్. సరస్వతి, తమ్ముడు మృత్యుస్మృతికిలోనై, కన్నీటిలో కాలాన్ని మఱచిపోలేదు. ఆ పెదవులపై మళ్ళీ చిరునవ్వు మెరిసింది. మృత్యు అవరోధాన్ని దాటి దంపతులు మళ్ళీ జీవితపు వసంతోత్సవంతో తన్మయులయారు.

ఈ దంపతుల మృత్యు ధిక్కారం, జీవన ఉల్లాసం చూసి పార్వతి చకితురాలైంది. దుఃఖభారం కింద భగ్నమవక మళ్లీ సరస్వతి జీవిత నావకు తెఱచాప నెత్తింది.

సరస్వతి కెంతటి శక్తి?...... ఎలా సిద్ధించింది?.....తానే సరస్వతికి ప్రచ్ఛన్న గురువేమో? అభాగ్య జీవితానికి పూర్ణ స్వరూపమైన తనకు సరస్వతి ఏకలవ్యుడు.

ఇన్ని నెలల నుంచి పార్వతి అంతరాకాశంలో ప్రశ్నలు, భిన్నవిభిన్న ప్రశ్నలు, తోకచుక్కల్లా మెరిసి దూసుకుపోతున్నయ్. తన ఈజీవితం ఎందుకు? ఏమిటి? మృత్యు నిరీక్షేనా? మృత్యు వాహనమేనా జీవితం? జీవితం అంటే?

ఈ అస్పష్ట జాగరణ ఇటీవల తీవ్రమైంది. మనస్సులో కమ్మిన నిశీథం నడిజాము తిరిగింది. అజ్ఞాతంగా, అస్పష్టంగా అడుగులు వేస్తున్న ప్రచ్ఛన్న పాంథికుడు వెలుగుకోసం తడుము కుంటున్నాడు.

తానెవరు? ఈ ప్రపంచ మేమిటి?

తన అజ్ఞానం ఘోరం. విధి విషపాత్రను తన కందించినప్పుడు కూడా తనకు తాను తెలియదు. తనకు జీవితం రహస్యంగానే ఉండిపోయింది. జీవిస్తూ జీవితాన్నెరుగదు.

పార్వతి హృదయం దహించుకుపోయింది. లజ్జావమానాలతో కళ్లు నీళ్లతో నిండినయ్.

కళ్లుండి కబోది..... కాళ్లుండి కుంటి..... ప్రాణముండి మృతజీవి.... ఇది దుర్భరం. ఈ అజ్ఞానం జన్మాపచారం.

కర్రపుచ్చుకొని అంధుడు దారికోసం తడుముకుంటున్నట్లు, పార్వతి అంతర్వ్యథతో తన మార్గమేమిటో తడుముకుంటోంది. ఈ అజ్ఞాన - జ్ఞానం అంతరాత్మలో తళుక్కుమంది. దారి స్పష్టంగా కనుపించేంత వెలుగు కాదు. కాని ఆ స్పృహమటుకు కలిగించింది.

తాను సజీవి. కాని మృతజీవికి తా నధీన. ఆ మృతజీవి తన కపరిచితుడని పాడెవద్ద తెలుసుకుంది. కలసి జీవించినంతకాలం తనకు తాను దూరమైంది. స్త్రీకి పరాధీనతే జీవితమా? వివాహం, దాంపత్యం.... తదుపరి...ఇదేనా జీవితం?

అందులోనూ ప్రభు ప్రేమభిక్ష తనకు లాభించలేదు. తానా యాచనకోసం దోసిలొగ్గక మునుపే విధి ప్రభువుకు మృత్యుభిక్షను ప్రసాదించింది. ఈ అజ్ఞాత మృతజీవికి అధీనురాలై తానుంది. అవును.... మరి ..... నలుగురితోపాటు....

తనకు ప్రభువుకు మధ్య నున్న ఆయథార్థ చంచల సంబంధాన్ని మృత్యువు స్పష్టంచేసింది. ఈ సంబంధ బాంధవ్యాల నిజ స్వరూపం తెలుసుకుంది. ఇట్టి చపల చాంచల్యాలకు జీవితం తలొగ్గి ఉండటం అపరాధం. జీవితం ఇంతకు అతీతమైంది. అది సంఘటనల కథీనం కాదు. దాంపత్యం లేక వైధవ్యం..... ఇవి జీవితం కాదు, ప్రతి పాణికీ జీవించే స్వత్వం ఉంది. ప్రియుల మిత్రుల, ఆప్తుల - సుఖదుఃఖాల కతీతమైనది జీవితం. జీవి అనధీన.....

పార్వతి మనస్సు వినిర్మలంగా నిశ్చలంగా వుంది. తన ఉనికి తాను తెలుసుకుంది. పెళ్లి పీటల మీద పుట్టి, భర్త చితిపై మరణించలేదు తాను.

జీవితం పెన్నిధి... ఆ పెన్నిధికి తాను యజమానురాలై కూడ, దారిద్ర్య భారంతో జీవిస్తోంది.

తన అధీనత్వాన్ని, అయధార్థతను , గోచరింపచేసింది మృత్యువు. ఇందుకు మృత్యువు తనకు గురువు. జీవితం యొక్క స్వరూపం మృత్యుముఖంలోంచి చూచింది.

మళ్లీ పాణిగ్రహణం.... కాదు. ఓ బిడ్డను పెంచుకోటం..... కాదు, వీటితోనే కాదు జీవితం. జీవిత సత్యం మెఱుపు మాత్రంగా మెరిసిపోయింది. ఆ వెలుగుబాటను అన్వేషించటమే జీవితం. జీవితం మహా ప్రవాహం. సంబంధ బాంధవ్యాలు భిన్న విభిన్న ఘట్టాలు.

పెళ్లికి మునుపు, పెళ్లికి తర్వాత నష్టమైన స్వేచ్ఛను పార్వతి తెలుసుకుంది.

ఇది జీవనపథం.... ఈనాటిది కాదు..... ఎందరో పూర్వ పథికులు...... వారి అడుగుల ధ్వని స్పష్టాస్పష్టంగా వినబడుతోంది.

యాత్రే నిత్యధర్మం. ఇంతకాలం తాను బాటకు ఎడంగా కూలబడి కృశిస్తోంది. ఇక తనయాత్ర నారంభించాలి. ఇంత వరకూ కాళ్లను నొక్కిపట్టుతున్న సంకెళ్లు తెగిపోయినయ్.

ప్రభు తన కన్యాయం చేయలేదు. తన్ను పరాధీన చేయలేదు. అతను కళ్లు మూసుకొని తనకు కళ్లు తెఱచాడు. ప్రేమభిక్ష పెట్టకపోయినా, జ్ఞానభిక్షచేశాడు. తొలివలపు చనిపోయిన తల్లిలా, పార్వతి గుండె దడదడ కొట్టుకుంది - ప్రభుకోసం.

నిశరాత్రి అయినా పార్వతికి నిద్రలేదు. గది కిటికీవద్ద నుంచొని శూన్యం లోకి చూస్తోంది. అమావాస్య చీకటి సర్వత్ర వ్యాపించింది. పార్వతి కళ్లు జ్యోతుల్లా ప్రజ్వరిల్లుతున్నయ్.

దూరాన తోటలో పాడు సత్రపు మొండి గోడలు చీకట్లో తలలు తెగిన చెట్లలా ఉన్నయ్. సన్నగా వెలుగు తళుక్కుమంది. అనాది సత్రం. వందలాది బాటసార్లు ఒకింత సేపాగి, అలసట తీర్చుకొని, మళ్లీ ముందుకు సాగిపోయారు. సాగిపోతారు. పార్వతి ఆ వెలుగును చూసింది. నిశరాత్రి....నిర్జన ప్రదేశంలో .... ఎవ్వడో బాటసారి.... యాత్రాధర్మము మఱువలేదు. కారు చీకటైనా, నిర్జన ప్రదేశమైనా బాట విడువలేదు.

ఒకింతసేపులో గుమ్మమువద్ద నిలబడి ఎవ్వరో 'అమ్మా! నిశరాత్రి వచ్చాను....ఓ అన్నం ముద్ద' అని కేక వేస్తున్నాడు. మెల్లగా గదిలోంచి వెళ్లి తలుపుతీసింది.

'అమ్మా... పట్టెడన్నం.'

శతవృద్ధు.....ముఖం ముడతల్లో యాత్రాభారం ప్రతిబింబిస్తోంది.

'నాకు లేకపోయినా....అమ్మా..... ఇబ్బందిలేదు. కుర్రవెధవ - రెండు పూటల నుంచి తిండిలేదు.'

ఇంట్లోకి పోయి తిరిగి వచ్చింది పార్వతి.

"ఏదో కొంచెంగా ఉంది తాతా! ఇదిగో" అంది.

'చాలు తల్లీ.... నా కెందుకు కుర్రకుంక.'

"ఎవరా అబ్బాయి?"

'ఎవడో? ఆ పరమాత్ముడికి తెలియాలి. నాలుగురోజుల క్రితం తిరణాలలో దుమ్ముకొట్టుకొని తూమువద్ద పడివున్నాడు. కాస్తలో కళ్లుమూసేవాడే తల్లీ.... ఆ చీకట్లో నా కాళ్లకేదో తగిలిందని, వంగి చూద్దునుకదా.... అయాసంతో యాతనపడుతున్నాడు.... తర్వాత .... తర్వాత.... ఎలాగో మళ్లీ

జగత్తులోకి వచ్చాడు..... ఏదో తల్లీ.... నన్ను విడవకుండా అంటిపెట్టుకొని వుంటున్నాడు.... వెళ్లా తల్లీ... అన్నపూర్ణవు...నువ్వు.'

పార్వతి గది కిటికీ వద్ద నుంచొని మళ్లీ శూన్యంలోకి చూస్తోంది. సత్రంలో దీపరేఖ తళుక్కు తళుక్కుమని వెలుగుతోంది. పార్వతి ఆ దీపంకేసి చూసింది. అమావాస్య చీకట్లో ఆ దీపరేఖ ఆరిపోకుండా వెలుగుతూ, క్రమేపీ సర్వత్రా వ్యాపిస్తున్నట్టుంది. బాహ్యాంతరాల్లో తమస్సుపోయి, జ్యోతి బింబం ప్రకాశిస్తోంది. అమావాస్యలో నిండు పూర్ణిమ.

ఇది జీవితం....పురాణ యాత్ర.... అసంఖ్యాకులైన పథికులు.....తానీనాడు బాటలో అడుగుపెట్టింది. కఠోరమై, దుర్గమమైన అంధకారం చుట్టుముట్టుతూ ఉంటుంది. అయినా, సముద్ర మధ్యంలోని నావకు ఆకాశ నక్షత్రంలా, అంతరాత్మలో వెలుగు తనకు దారి చూపిస్తుంది.

దిక్కుమాలిన అర్భక బాలుడు మొండి గోడల మధ్య పాడుతున్నాడు. సంస్కారం లేని మధురస్వరం. నిర్జన శబ్దంలో పాటశరవేగంలో తేలిపోతోంది. అనాథ బాలకుని ఆశాగీతికి పార్వతి హృదయం స్పందించింది.

మూలనుండి ఫిడేలు....సాలీడు గూళ్లు పట్టి. పొంగి పొరలింది దుఃఖం. పార్వతి ఉత్తేజిత స్పర్శలో ఫిడేలు మధురతమంగా పాడుతోంది. ఇంటితోపాటు నిశ్చల శూన్యమంతా సహస్రవాద్యాల సమ్మేళనంలా ప్రతిధ్వనిస్తోంది.

జాము తర్వాత జాము గడచిపోయింది. ప్రాగ్దిశాశయ్యపై నుంచి లేచి, ఉషస్సు కళ్లు తెరుస్తోంది. చంటివాని చిఱునవ్వులా వెలుగు విశ్వవీథుల్లో దూసుకుపోతోంది.

ఈ ఉషస్సు కోసమే పార్వతి ప్రతీక్షిస్తోంది. పార్వతి అనధీన. ఆమె కిప్పుడు ఉషస్సు.

✸

**సమత మాసపత్రిక, జనవరి 1948.**